దేశభక్తి కలిగి ఉండాలి— నారంశెట్టి ఉమామహేశ్వరరావు

"భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు. నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను" అంటూ బడిలో ప్రార్థన సమయంలో ప్రతిజ్ఞ చేయిస్తారు. అందువల్ల ప్రయోజనమేముందనే సందేహం ఎవరికైనా కలిగిందేమో. ఆ సందేహం తీర్చుకుందాం.

ఋషులు, మునీశ్వరులు నడయాడిన పవిత్ర భూమి మనది. అలాంటి భారతదేశంలో జన్మించిన మనమంతా భారతీయులం. మన దేశం పట్ల విధేయత పెంపొందించడానికి , దేశభక్తిని పెంచడానికి, మనమంతా ఒక్కటేనన్న జాతీయ భావన కలిగించడానికే రోజూ జాతీయగీతం పాడిస్తారు. దేశం పట్ల, భారతీయుల పట్ల ఎలాంటి ప్రవర్తన కలిగివుండాలో తెలిసేలా ప్రతిజ్ఞ చేయిస్తారు. బాల్యం నుండే దేశభక్తి భావనలు మెండుగా కలిగినట్లయితే దేశ పౌరులంతా ఐకమత్యంతో మెలగుతారన్న సదాశయం, ముందుచూపు ప్రతిజ్ఞ చేయించడం వెనుక దాగి ఉన్నాయి.

దేశభక్తి అంటే ఏమిటో తెలుసుకుందాం. భక్తి అంటే ఒక పవిత్రమైన భావం. దృఢమైన విశ్వాసంతో నమ్మిన దైవాన్ని ప్రార్థించడం, వినయవిధేయతలతో హృదయాన్ని భగవంతునికి అర్పించడమే భక్తి . దేశభక్తి అంటే ....దేశం పట్ల భక్తి భావం కలిగి ఉండటం. జన్మించిన దేశాన్ని, సాటి ప్రజలను, దేశ సంస్కృతిని ప్రేమించడం, దేశానికి సేవ చేయడం. జన్మనిచ్చిన ఊరు, రాష్ట్రం, దేశం మీద ప్రేమ, విశ్వాసం, విధేయత చూపించడం. వాటి అభివృద్ధికి పాటుపడటం. అదే దేశభక్తి.

అలాంటి దేశభక్తి భావాన్ని ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలి. ఆ భావం ఒకరి ద్వారా మరొకరికి సమాజం మొత్తం వ్యాపించాలి. అప్పుడే దేశ అభివృద్ధికి, రక్షణకి, సమిష్టి కృషికి మేలు జరుగుతుంది. ప్రజలకు ఎన్నెన్నో సంక్షేమ కార్యక్రమాలు చేయడానికి ప్రభుత్వానికి ఉపయోగపడుతుంది. దేశభక్తిని పెంపొందించుకోవడం ద్వారా మాత్రమే మనం ఒక మంచి సమాజాన్ని నిర్మించగలం. దేశాన్ని ప్రగతి పథంలో నడిపించగలం. కేవలం జాతీయ పండుగల రోజు జెండా పట్టుకుని ఊరేగించడం వల్ల ప్రయోజనం ఉండదు. దేశ ప్రయోజనాల కోసం మనలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక విధంగా నిత్యమూ కృషి చేయడమే నిజమైన దేశభక్తి.

ప్రజల్లో దేశభక్తిని పెంచడానికి, ఉన్న దేశభక్తిని రగిలించడానికి కవులు, రచయితలు, కళాకారులు చాలా విధాలుగా ప్రయత్నించారు. తమ కలాలకు పని కల్పించి అద్భుతమైన దేశభక్తి సాహిత్యం రాసారు కవులు. వాటిని తమ గానం ద్వారా ప్రఖ్యాతి చెందించారు గాయకులు. నటన ద్వారా ప్రజల హృదయాలకు చేర్చారు కళాకారులు.

ఏ దేశమేగినా ఎందుకాలిడినా/ ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా /పొగడరా నీ తల్లి భూమి భారతిని / నిలుపరా నీ జాతి నిండు గౌరవము/

అని భారతీయులు గర్వించే ఉత్తమ గీతం రాసారు రాయప్రోలు సుబ్బారావు. దేశ ప్రజలు ప్రవర్తించాల్సిన విధానాన్ని చక్కగా బోధించారు.

భారతీయులుగా మన దేశాన్ని కాపాడుకోవడం, దేశానికి పేరు ప్రతిష్టలు తెచ్చే విధంగా ప్రవర్తించడం , దేశ ఖ్యాతిని అంతర్జాతీయ సమాజం గుర్తించే గొప్ప స్థాయికి చేర్చడం వంటి మంచి పనుల ద్వారా మనలోని దేశభక్తిని ప్రదర్శించుకునే అవకాశం ప్రతి ఒక్కరికీ ఉంది.

"మొదట నేను భరతపుత్రుడ ననుకొమ్ము/ పిదప తెలుగుదనము బెంచుకొమ్ము/
భరత పద్మమందు పసిడి రేకవు నీవు/తేనెబొట్టు నీది తెలుగు బిడ్డ/

అంటారు నార్ల చిరంజీవి. పిల్లలకు బాల్యం నుండే మంచి పద్ధతులు నేర్పించాలన్న సదుద్దేశంతో నార్ల చిరంజీవి రాసిన తెలుగు బిడ్డ శతకంలోని పద్యమది. మనసులో భారతీయుడిననే భావం పెంచుకోవాలని, తరువాత తెలుగువాడిగా తెలుగుదనం పెంచుకోవాలని దేశభక్తితో కూడిన హితవు పలికారు.

మనకు జన్మనిచ్చిన దేశాన్ని మాతృభూమిఅంటాం. కాబట్టి మన తల్లి పట్ల మనం చూపినంత ప్రేమనే దేశం పట్ల చూపించాలి. మన దేశం తల్లి కంటే ఎక్కువే కానీ తక్కువ కాదు. జన్మభూమి మనకి ఎదగడానికి, జీవించడానికి సహాయపడుతుంది. అందుకే దేశభక్తి అనే సద్గుణాన్ని తప్పనిసరిగా అలవరచుకోవాలి. దేశ సమగ్రత, ప్రగతి మరియు స్వతంత్రతకు ముఖ్యమైన శక్తిగా మనలో ఉండే దేశభక్తి సహాయపడుతుంది. ప్రజలను ఒకటిగా ఉంచి, దేశం పట్ల కట్టుబడి ఉండేలా చేస్తుంది. ప్రయోజనాల వైరుధ్యం లేకుండా సంతోషకరమైన వాతావరణంలో నివసించేలా ప్రోత్సహిస్తుంది. స్వార్థపూరితమైన, ప్రమాదకరమైన ఆలోచనలను కలగకుండా ఆపుతుంది. పరోక్షంగా అవినీతిని తగ్గిస్తుంది. అవినీతి లేని ప్రభుత్వం ఏర్పడితే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుంది.

దేశభక్తులు వారి వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి, దేశం కోసం తమ కృషిని అర్పిస్తారు. అందుకు ఉదాహరణ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలే. భారతదేశం విదేశీ పాలనలో నలిగి, బానిసత్వంలో మగ్గిందనే విషయం మీకు తెలిసిందే. ఈ రోజు మనం పీలుస్తున్న స్వేచ్ఛా వాయువులు, అనుభవిస్తున్న స్వాతంత్రం ఎందరో దేశభక్తుల త్యాగఫలం. మన దేశానికి స్వాతంత్ర్యం సాధించడం కోసం వారు చేసిన పోరాటాలు, ఉద్యమాలు, ప్రాణత్యాగాలు అన్నీ ఇన్నీ కావు. మన పూర్వీకులు ఒక్కతాటిపై నడిచి స్వరాజ్య సాధన జరిపించేలా వారందరినీ నడిపింది, కలిపి ఉంచింది అందరి హృదయాల్లో ఉన్న దేశభక్తి మాత్రమే.

మహాత్మాగాంధీ , సర్దార్ వల్లభాయ్ పటేల్, బాలగంగాధర్ తిలక్ మున్నగు వారు శాంతియుత పోరాటాలతో నిరసన తెలుపగా, ఝాన్సీలక్ష్మీభాయి, చంద్రశేఖర ఆజాద్, భగత్ సింగ్ వంటి వీర దేశభక్తులు నవ్వుతూ తమ ప్రాణాలను దేశం కోసం అర్పించారు. వారి త్యాగాల ఫలితం వల్లనే భరతమాత దాస్య శృంఖలాలు తొలిగాయి. వారు చూపిన దేశభక్తికి అత్యున్నత రూపమే నేటి మన భారతదేశం.

మన సమాజంలో దేశభక్తి కేవలం సైనిక పోరాటాలకు మాత్రమే పరిమితం కాలేదు. విద్య, వైద్యం, సాంకేతికత, పరిశోధన, పరిశ్రమల అభివృద్ధి మొదలైన వివిధ రంగాలలో కనబడుతోంది. వాటిలో కృషి చేయడం ద్వారా పౌరులుగా దేశానికి సేవలను అందించవచ్చు. స్వచ్ఛ భారత్, ఆత్మనిర్భర భారత్ వంటి పథకాల ద్వారా దేశాభివృద్ధికి ప్రతి పౌరుడూ సహకారం అందించవచ్చు.

చరిత్రలో అనేక మంది దేశభక్తులైన రాజులున్నారు. వారిలో ఛత్రపతి శివాజీ గొప్ప దేశభక్తుడు, ధైర్యవంతుడైన రాజుగా పేరుపొందాడు. ఆయనలాగా దేశాన్ని, ప్రజలను, సంస్కృతిని కాపాడటానికి పోరాడిన అనేక మంది మహారాజులు ఉన్నారు. వారిలో మొఘల్ రాజవంశానికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన మేవార్ రాజు మహారాణా ప్రతాప్, మొఘల్ చక్రవర్తి బాబర్‌ను ఎదిరించిన రాజ్‌పుతానా ప్రాంతానికి చెందిన రాణా సంగ , దక్షిణ భారతదేశం నుండి ఆగ్నేయ ఆసియా వరకు తన సామ్రాజ్యాన్ని విస్తరించిన రాజరాజ చోళుడు, దక్షిణ భారతదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి, ప్రజల రక్షణకు ఎంతో కృషి చేసిన విజయనగర సామ్రాజ్యానికి చెందిన శ్రీకృష్ణదేవరాయలు , స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారిపై పోరాటం చేసిన కర్ణాటకలోని కిత్తూరు ప్రాంతానికి చెందిన రాణి కిత్తూర్ చేనమ్మ , మొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడడమేకాక తెలివితేటలు, ధైర్యంతో ప్రసిద్ధి చెందిన భారత్‌పూర్ రాజు రాజా సూరజ్ మల్ మొదలైన వారు దేశభక్తికి మారుపేరుగా నిలిచారు. ధర్మాన్ని కాపాడుతూ ప్రజా సంక్షేమం కోసం ఎన్నెన్నో త్యాగాలు చేసారు. తరువాతి తరం వారికి ఆదర్శంగా నిలిచారు.

దేశభక్తి అనే భావం ఇప్పటిది కాదు. త్రేతాయుగంలోనే శ్రీరాముడు దేశభక్తి భావాన్ని ప్రకటించాడు. రావణ వధానంతరం స్వర్ణ లంక నుంచి బయలుదేరి పోవాలి. అప్పుడు శ్రీరాముడు లక్ష్మణుడితో పలికిన మాటలు ఈ శ్లోకంలో ఉన్నాయి.

"అపి స్వర్ణమయీ లంకా న మే లక్ష్మణ రోచతే
జననీ జన్మ భూమి శ్చ స్వర్గాదపి గరీయసీ"

"ఈ లంక ఎంత వైభవోపేతమైనా లక్ష్మణా నాకేమీ నచ్చడం లేదయ్యా. తల్లి, పుట్టిన ఊరు స్వర్గం కంటే గూడా గొప్పవయ్యా .ఇది మన అయోధ్యతో సమానమవుతుందా?" అని భావం.

చిన్నప్పటి స్నేహాలు, పెరిగిన వాతావరణం దానితో ఏర్పడి పోయే అనుబంధం గొప్పవి. ఆప్యాయంగా పెంచిన పెద్దలు, నాటిన చెట్టు చేమలు మనిషి మనసుపై చెరగని ముద్ర వేస్తాయి. మనం నివసించిన ప్రదేశం మన అంతరాంతరాలను స్పృశిస్తూ భావోద్వేగాలను కలిగిస్తూ ఉంటుంది. అలాంటిదే మరో ఉదాహరణ .

పుట్టి పెరిగిన కణ్వాశ్రమం వదలి పోవాలంటే శకుంతలకు కాళ్ళు సాగలేదు. 'మళ్ళీ ఎప్పుడు నా ఆశ్రమానికి వచ్చేది నాయనా?' అని కన్నీరు పెట్టుకుంది. తండ్రికీ కన్నీరు ఆగలేదు.

"భూత్వా చిరాయ చతురంత మహీ సపత్నీ
దౌష్యంతిం అప్రతిరథం తనయం ప్రసూయ
భర్త్రా తదర్పిత కుటుంబ భరేణ సార్థం
శాంతే కరిష్యసి పదం పునరాశ్రమేస్మిన్!"

"పోయిరా తల్లీ! మంచి బిడ్డను కను. వాణ్ణి పెద్ద చేసి అన్ని బాధ్యతలు వాడి నెత్తిన పెట్టి ఆ జంఝాటమంతా తీరి ప్రశాంతంగా నీవూ , మీ ఇంటాయన కలిసి రండి. ఈ ప్రశాంతమైన ఆశ్రమం నీకు ఊరటనిస్తుంది " అని బదులిచ్చినట్టు ఆ శ్లోకం యొక్క భావం వివరిస్తుంది. అలా కూతురిని ఆశీర్వదించి పంపుతాడు కణ్వమహర్షి. శకుంతలకు ఉన్నట్టి మమకార భావమే అందరికీ ఉంటుంది పుట్టిన ప్రదేశం మీద. అలాగే ఎవరి తల్లి వారికి గొప్పది. దేశం ఇంకా గొప్పది. అందుకే దేశభక్తి కలిగివుండాలి.

దేశభక్తులు వారి దేశం సాధించిన ప్రగతి, సంప్రదాయాలు మొదలైన వాటిని గర్వంగా భావిస్తారు. దేశభక్తి, జాతీయతా భావం ఒక్కటే. దేశభక్తిలో వ్యక్తి కంటే దేశానికే ప్రాధాన్యత ఎక్కువ. ఇది ముఖ్యంగా జాతీయ రక్షణ వ్యవస్థలో కనిపిస్తుంది. ప్రాణాన్ని కూడా త్యాగం చేయడాన్ని గర్వంగా భావిస్తారు సైనికులు. దేశభక్తి అంటే దేశం, చరిత్ర, సంప్రదాయాల పట్ల ప్రేమ, గౌరవ భావన కలిగి ఉంటూ దేశ అభివృద్ధికి, దాని చారిత్రక వారసత్వాన్ని పరిరక్షించడానికి కృషి చేయడంగా కూడా చెప్పవచ్చు.

నేటి బాలల్ని ఉత్తమ పౌరులుగా తయారుచేయడానికి కుటుంబంలో పెద్దలు, పాఠశాలలో ఉపాధ్యాయులు కృషి చేయాలి. పిల్లలకు స్వాతంత్ర్య సమర యోధుల గాథలను తరచూ వినిపించాలి. మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ వంటి త్యాగపురుషుల జీవితాలను కథల రూపంలో పాఠాలలో చేర్పించి బోధించాలి. వారి త్యాగాలు, ధైర్యం పిల్లలకు చెబితే పిల్లల్లో తప్పక ప్రేరణ కలుగుతుంది.

స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15), గణతంత్ర దినోత్సవం( జనవరి 26), గాంధీ జయంతి(అక్టోబర్ 2) వంటి ప్రత్యేక రోజుల్లో నిర్వహించే పండుగలను బడి పిల్లల మధ్య, పిల్లల చేత ఘనంగా జరిపించాలి. దేశ చరిత్ర, సంస్కృతి గురించి ఉపన్యాసాలు, కథలు చెప్పడం ద్వారా పిల్లలకు దేశభక్తి, విలువలు నేర్పాలి. చిన్న వయసు నుండే సమాజ సేవా కార్యక్రమాలలో పాల్గొనేలా ప్రోత్సహించాలి. అప్పుడే పిల్లలకు సమాజంలోని సమస్యల పట్ల అవగాహన, ప్రజల కష్ట సుఖాలు సరిగా అర్థమౌతాయి.

ప్రకృతిని కాపాడటం కూడా దేశానికి సేవ చేయడమేనన్న భావం పిల్లల్లో కలిగించాలి. స్వచ్ఛ భారత్ , చెట్లు నాటడం, నీటిని ఆదా చేయడం వంటి విషయాలు చెబుతూనే పిల్లలను ఆయా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలి . అవకాశం ఉన్న ప్రతి రంగంలో దేశానికి సేవ చేయాలన్న ఆసక్తిని పిల్లల్లో పెంపొందించాలి. దేశం పట్ల ప్రేమ, సేవాభావం కలిగిన పిల్లలు పెద్దయ్యాక దేశాన్ని మంచి మార్గంలో నడిపించగలరు. విద్య, విజ్ఞానంతో పాటు పిల్లలకు దేశభక్తి అనే విలువ నేర్పించడం చాలా అవసరం. దేశభక్తితో నిండి ఉన్న సమాజం దేశానికి గొప్ప బలం కాగలదు.

దేశభక్తి కలిగి ఉన్నట్టు తెలిపేందుకు జాతీయ గీతం కోసం నిలబడటం, మువ్వన్నెల జెండా పట్ల విధేయత చూపడం, ప్రతిజ్ఞను పఠించడం చాలా అవసరం. ఇలా చేయడం వల్ల పౌరుల్లో ఐకమత్యం పెరగడమే కాకుండా దేశాన్ని బలోపేతం చేసే చర్యగా రూపు దాలుస్తుంది.

ఎన్నికల్లో ఓటు వేయడాన్ని కూడ దేశభక్తిగానే పరిగణించాలి. తెలివిగా ఆలోచించి సరైన పాలకులను ఎన్నిక చేసుకోవడం ద్వారా అవినీతి లేని పాలన అందించడానికి సాయపడాలి పౌరులు. అదొక మొక్కుబడి చర్యగా కాకుండా ముఖ్యమైన బాధ్యతగా భావించాలి. మంచి నాయకులను ఎన్నుకుంటే దేశానికి ప్రయోజనం కలుగుతుంది. తొందరగా దేశం అభివృద్ధి చెందుతుంది.

ప్రజాస్వామ్య దేశంలో నివసిస్తున్న పౌరులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడం దేశభక్తిలో భాగమే. దేశం కోసం స్వచ్ఛందంగా పనిచేయడం, ఎన్నుకోబడిన ప్రభుత్వ పదవికి పోటీ చేయడం, దేశంలోని అన్ని చట్టాలను గౌరవించడం, నిబంధనలు పాటించడం, సహేతుకమైన పన్నులు చెల్లించడం, రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, స్వేచ్ఛలు, బాధ్యతలను అర్థం చేసుకుని అమలుపరచడం కూడ దేశభక్తిగానే భావించాలి.

దేశభక్తి గురించి ఎంత చెప్పినా ఇంకా మిగిలే ఉంటుంది. అంత గొప్ప అంశమైన దేశభక్తి వ్యాసాన్ని మహాకవి గురజాడ అప్పారావు వ్రాసిన దేశభక్తి గేయంతో ముగిద్దాం.

దేశమును ప్రేమించుమన్నా/మంచి యన్నది పెంచుమన్నా/వొట్టి మాటలు కట్టిపెట్టోయ్/గట్టి మేల్ తలపెట్టవోయ్/

పాడి పంటలు పొంగిపొరలే/ దారిలో నువు పాటు పడవోయ్/తిండి కలిగితే కండ కలదోయ్/కండ కలవాడేను మనిషోయ్

ఈసురోమని మనుషులుంటే/ దేశమే గతి బాగుపడునోయ్/జల్దుకొని కళలెల్ల నేర్చుకు/దేశి సరకులు నింపవోయ్

అన్ని దేశాల్ క్రమ్మవలె నోయ్/దేశి సరుకుల నమ్మవలెనోయి/డబ్బు తేలేనట్టి నరులకు/కీర్తి సంపద లబ్బవోయి

దేశభక్తి గురించి చదివిన మీరంతా దేశభక్తులై దేశానికి సేవ చేస్తారు కదూ. జై హింద్ !

__-*****_____